

	కనిష్టం	గరిష్టం
ఖమ్మం	36	23
భద్రాద్రి కొత్తగూడెం	36	25



ఉమ్మడి జిల్లాలో 1022 ఖాళీలు

- ఖమ్మంలో 575... భద్రాద్రి కొత్తగూడెంలో 447
- మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఉద్యోగార్థుల్లో ఆనందం

ఖమ్మం ఖానాపురం హవేలి ఫిబ్రవరి 29: గత పదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గురువారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1022 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలకు మార్గం రావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్‌తో గతంలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి కొత్తగా దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. వారి దరఖాస్తులను ఈ నోటిఫికేషన్లో పరిగణలోకి తీసుకుంటామని తెలిపింది.

ఖమ్మం జిల్లాలో మొత్తం ఖాళీలు 575 కాగా, భద్రాద్రి కొత్తగూడెంలో 447గా ఉన్నాయి. మొత్తం 1022 ఖాళీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 176, లాంగ్వేజ్ పండిట్ 18, ఫిజికల్ ఉపాధ్యాయులు 10, సెకండరీ గ్రేడ్ టీచర్లు 334, స్పెషల్ ఎడ్యుకేటర్స్ స్కూల్ అసిస్టెంట్స్ 8, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 29తో మొత్తం 575 ఖాళీలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 129, లాంగ్వేజ్ పండిట్ 10, ఫిజికల్ ఉపాధ్యాయులు 1, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు 268, స్పెషల్ ఎడ్యుకేటర్స్ స్కూల్ అసిస్టెంట్స్ 8, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 31, మొత్తం 447 ఖాళీలు ఉన్నాయని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 5,500 మంది, భద్రాద్రి కొత్తగూడెంలో 4,500 మంది అర్హులున్నట్లు అధికారులు తెలిపారు. కాగా వీరంతా గత డీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న వాళ్లేనని తెలిసింది. నోటిఫికేషన్‌తో ప్రిపరేషన్‌ను ముమ్మరం చేశారు.

ఆర్టీసీ మేడారం ఆదాయం రూ. 3.53 కోట్లు

ఖమ్మం ఖానాపురం హవేలి ఫిబ్రవరి 29: మేడారం మహా జాతర సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఏడు డిపోల్లో ఆర్టీసీకి రూ.3కోట్ల 53 లక్షల 85వేల ఆదాయం వచ్చినట్లు రీజనల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఖమ్మం డిపో నుంచి 85 బస్సుల ఆదాయం రూ.59 లక్షల 97వేలు, మధిర 20 బస్సుల ఆదాయం రూ.25లక్షల 56వేలు, సత్తుపల్లి 33 బస్సుల ఆదాయం రూ. 34లక్షల 96 వేలు, భద్రాచలం నుంచి 30 బస్సుల ఆదాయం రూ. 57లక్షల 32వేలు, కొత్తగూడెం నుంచి 119 బస్సుల ఆదాయం రూ.కోటి 23 లక్షల 87వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మొత్తం 310 బస్సుల్లో 2లక్షల, 36వేల 909 మంది ప్రయాణించగా... అందులో మహాలక్ష్మి పథకం కింద 1,46,281 మంది, సాధారణ ప్రయాణికులు 90,628 మంది ప్రయాణించినట్లు ఆర్ఎం తెలిపారు.

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.1.81కోట్లు 7

గ్రామాల్లో చేపల పెంపకం, విక్రయానికి ప్రభుత్వం అందిస్తున్న చేయూత, ప్రోత్సాహకాలు పక్కదారి పడుతున్నాయి. మత్స్యకారులు లబ్ధిపొందేందుకు చేపల సొసైటీలు ఏర్పాటు చేసి వాటిపైన మత్స్యశాఖకు అజమాయిషీ కల్పించినా క్షేత్రస్థాయిలో మాత్రం కాంట్రాక్టర్లు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో చేపల సొసైటీలు పేరుకే కనిపిస్తున్నాయి. వ్యాపారమంతా కాంట్రాక్టర్ల చేతుల్లోనే సాగుతోంది. చేపల వ్యాపారంలో మత్స్యకారులు కూలీలుగా మిగిలిపోతుండగా, కాంట్రాక్టర్లు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. సొసైటీలను నామమాత్రం చేయడమేకాకుండా, అవి సొంతంగా మార్కెటింగ్ చేయకుండా కింది నుంచి పై వరకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. కాంట్రాక్టర్లు బినామీలుగా అవతారమెత్తి అక్రమ వ్యాపారం సాగిస్తున్నా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా వారికి చేదోడుగా నిలిచి సహకరిస్తున్నారు.





చేపల చెరువుల్లో.. దళారుల దరువు



- జోరుగా సాగుతున్న అక్రమ వ్యాపారం
- సొసైటీలను నామమాత్రం చేసి కోట్లకు పడగలెత్తుతున్న దళారులు
- లోపాయికారిగా సహకరిస్తున్న మత్స్యశాఖ అధికారులు, పోలీసులు
- ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.300 కోట్లకుపైగా చేపల వ్యాపారం
- ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్న కాంట్రాక్టర్లు
- కూలీలుగా మిగిలిపోతున్న మత్స్యకారులు
- నిష్ఫలం అవుతున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు

ఖమ్మం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని నేలకొండపల్లి మండలం చెరువుమాధారం చెరువులో గురువారం జరిగిన సంఘటన చేపల చెరువుల్లో జరుగుతున్న అక్రమాలను కళ్లకు కట్టింది. చేపల సొసైటీల ఆధ్వర్యంలో సభ్యులు చేపలు పట్టుకుని, అమ్ముకుని సొమ్ము చేసుకోవాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు వారికి నామమాత్రంగా డబ్బులిచ్చి సొసైటీలను తమ చేతుల్లోకి తీసుకొని చేపలను దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసి పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే చెరువుల వద్ద శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చెరువుమాధారం చెరువులో చేపల వేటకు వెళ్లి శివ అనే యువకుడిని చేపల కాంట్రాక్టర్‌కు చెందిన మనుషులు కొట్టి చంపారని గ్రామస్తులు ఆందోళనకు దిగిన విషయం విదితమే.

ఇది ఒక చెరువుమాధారం చెరువులో జరుగుతున్న చేపల వ్యాపారమే కాదు, ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లోనూ ఇదే దందా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిఏటా రూ.300 కోట్ల విలువైన చేపల వ్యాపారం నడుస్తున్నది. ఉమ్మడి జిల్లాలో సుమారు 2వేల చెరువులుండగా పాలేరు, తాలిపేరు, వైరా,పెద్దవాగు, కిన్నెరసాని, బేతుపల్లి, లంకసాగర్ వద్ద ప్రాజెక్టులు, చెరువుమాధారం, అశ్వాపురం మండలంలో తుమ్మల చెరువు, సుజాతనగర్ చెరువు వంటి చెరువులు కూడా ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. ఇవన్నీ ఆయా గ్రామాల్లోని చేపల వృత్తి కొనసాగించే వారిని సభ్యులుగా చేసుకుని సొసైటీలు ఏర్పాటు చేశారు.

ఈ సొసైటీల ద్వారానే ప్రభుత్వం ప్రతిఏటా ఉచితంగా రూ.5కోట్ల విలువైన చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో, ప్రాజెక్టుల్లో వదులుతున్నారు. చేపల పెంపకందారులకు సొసైటీల ద్వారా రుణాలు ఇవ్వడంతో పాటు చేపలకు అవసరమైన మేత, చేపలు రవాణా చేసుకునేందుకు ద్విచక్రవాహనాలు, మొబైల్‌వ్యాన్లు అందిస్తున్నారు. చేపలు అమ్ముకునేందుకు స్టాల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తున్నది. చేప పిల్లలను చెరువుల్లో, ప్రాజెక్టుల్లో వదిలినప్పటి నుంచి మార్కెట్‌కు తరలించే వరకు ప్రభుత్వం ఆర్థికంగా సాంకేతికంగా చేయూత ఇస్తున్నది. కొంతమందికి వలలు, బోట్లు, ఇతరత్రా పరికరాలను కూడా సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు చేపల వృత్తిలో ఉపాధి పొంది ఆర్థికంగా పైస్థాయికి తీసుకెళ్లేందుకు కోట్లాది రూపాయల నిధులు ఖర్చుచేస్తున్నా.. చేపల సొసైటీల్లోని సభ్యులు చేపలుపెరిగే తరుణంలోనే డబ్బులకు ఆశపడి కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన చేపల కాంట్రాక్టర్లు చెరువులు, ప్రాజెక్టుల్లోని చేపలు పెరిగిన తర్వాత వాటిని పట్టుకోవడం, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గోవా, విజయవాడ, హైదరాబాద్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి చేపల ఎగుమతి చేసి పెద్దఎత్తున ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. చేపల సొసైటీకి వేలు, లక్షల్లో సొమ్ములు ఇచ్చి కాంట్రాక్టర్లు అనతి కాలంలోనే కోట్లు గడిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతిఏటా 20నుంచి30వేల మెట్రిక్ టన్నుల చేపలు ఎగుమతి కావడం ద్వారా సుమారు రూ. 300కోట్ల టర్నోవర్ నడుస్తోంది. సొసైటీల నుంచి తక్కువ సొమ్ముకే దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు చేపలు పెరిగి పట్టే తరుణంలో మత్స్యశాఖ అధికారులను, పోలీసు అధికారులను ఆయా పరిధిలోని స్టేషన్ సిబ్బందిని మచ్చిక చేసుకొని గ్రామస్తులు అడ్డురాకుండా లారీల్లో చేపలు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చోటామోటా నాయకులు అడ్డుపడితే వారికి కూడా ముడుపులు ముట్టజెప్పి తమ వ్యాపారానికి అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారు.

ఈ పరిస్థితుల మూలంగా మత్స్యకారులు, మత్స్యసొసైటీలు నామమాత్రంగా మిగులుతున్నాయి. మార్కెటింగ్‌పై అవగాహన లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లి చేపలు అమ్మే విధానం తెలుసుకోక మత్స్య సొసైటీల సభ్యులు కాంట్రాక్టర్ల చేతిలో మోసపోతున్నారు. ఎవరైనా చేపలనుపట్టి నేరుగా ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తే కాంట్రాక్టర్లు సిండికేట్ అయి సొసైటీ ఎగుమతిదారులకు చేపల వ్యాపారుల నుంచి సహాయ నిరాకరణ జరిగేలా వ్యూహాలు వేస్తున్నారు. దీంతో సొంత వ్యాపారం చేద్దామనుకుంటున్న చేపల సొసైటీలకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లోని చేపల వ్యాపారులు కాంట్రాక్టర్లు చెప్పినట్టుగానే కొనుగోళ్లు సాగిస్తున్నారు. దీంతో సొసైటీలకు చేపలు అమ్ముకునే అవకాశాలు లేక క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్లు చెప్పిన రేటుకు, ఇచ్చిన సొమ్ముకు ఆశపడి చెరువులను వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఈ చేపల దందాపై జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి కాంట్రాక్టర్లను నిలువరించాల్సిన అవసరం ఉంది.

వైద్య కళాశాలను అద్భుతంగా తీర్చిదిద్దాలి

- విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలి
- నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల



మెడికల్ కళాశాల నిర్మాణ పనులపై కంపెనీ ప్రతినిధితో చర్చిస్తున్న మంత్రి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలోనే ప్రముఖ వైద్య కళాశాలగా ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలను తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం ఖమ్మం మెడికల్ కాలేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు ద్రుమతారు కన్సల్టెన్సీ నిర్వాహకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణాల గురించి వివరించారు. డీపీఆర్ ప్రకారం నిర్మాణాలు, ఇతరత్రా వివరాలను మ్యాపు ద్వారా మంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీ నిర్వహణకు పాత కలెక్టరేట్ భవనాన్ని వినియోగిస్తున్నారని, కొత్త భవన నిర్మాణానికి 5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని మంత్రికి వివరించారు. మెడికల్‌కాలేజీ భవనం, వసతి గృహాలు, ప్రిన్సిపాల్ క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు మంత్రి తుమ్మలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం మొదటి విద్యాసంవత్సరం ప్రారంభం అయిందన్నారు. అయితే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు సరిపడ నిర్మాణాలుండాలన్నారు. రెసిడెంట్ డాక్టర్స్, బోధన సిబ్బంది వసతి గృహాలు, మెడికల్ కాలేజీ అనుబంధ భవన నిర్మాణాలు, వీటన్నింటినీ పరిగాణలోనికి తీసుకొని అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. అత్యాధునిక హంగులతో విశాల ప్రదేశంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరగాలని మంత్రి తుమ్మల వారికి సూచించారు.



మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

కాంగ్రెస్ గూటికి భద్రాద్రి జడ్పీ చైర్మన్

కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రావు గురువారం 'కారు'కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం కొత్తగూడెం పర్యటనకు విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కంచర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కంచర్ల గతంలో 20ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. అనంతరం చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాలుగేళ్ల పాటు టీడీపీలో కొనసాగారు. 2012లో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 2019లో చుంచుపల్లి జడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అప్పుడు కోరం కనకయ్య చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే 2023 నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కనకయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో జడ్పీ చైర్మన్ పదవి ఖాళీ అయింది. ఈ క్రమంలో కంచర్ల జడ్పీ చైర్మన్‌గా నియమితులయ్యారు. గతంలో పొంగులేటితో సన్నిహితంగా ఉన్న కంచర్ల కొంతకాలం ఆయన వర్గానికి దూరంగా ఉన్నారు. మళ్లీ పొంగులేటి గూటికి చేరారు. ఆయనతో పాటు, మరికొంతమంది ప్రముఖులు కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్ పార్టీలో చేరానని కంచర్ల తెలిపారు.



కత్తిపోట్లతో సూరంపల్లి రామారావు

కాంగ్రెస్ నేతపై హత్యాయత్నం

- కొణిజర్లలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుల ఘాతుకం
- కడుపు భాగంలో కత్తిపోట్లు
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

6

రఘునాథపాలెంలోనూ...

- కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిపై ముగ్గురు వ్యక్తుల దాడి
- అక్రమ మైనింగ్ వ్యాపారంపై ఫిర్యాదు చేయడమే కారణం

6



3,20,650 మంది..

వంట గ్యాస్ రాయితీ పొందే లబ్ధిదారుల సంఖ్య

- సిలిండర్ ధరలో రూ.500పోను మిగతా మొత్తం ఖాతాల్లో జమ
- పథకం అమలుకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- తెల్లరేషన్ కార్డు వున్న వారికే వర్తింపు
- పేద, మధ్య తరగతి వర్గాల్లో హర్షాతిరేకాలు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో భాగంగా వంటగ్యాస్ రాయితీని అమలు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 4,10,404మంది గ్యాస్ వినియోగదారులు ఉంటే వారిలో 3లక్షల 20వేల 650 మంది అర్హులుగా తేల్చారు. వారందరికీ ఈ నెల నుంచి గ్యాస్‌రాయితీని వర్తింప చేయనున్నారు. ఈ పథకానికి 20మండలాల నుంచి 5లక్షల 49వేల దరఖాస్తులు రాగా, ప్రస్తుతం దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500కే గ్యాస్ పథకం అమలుచేయనుంది.

ప్రస్తుతం సిలిండర్ కొనుగోలు చేసిన వినియోగదారునికి రాయితీ సొమ్ము రూ.18 జమ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 34గ్యాస్ ఏజెన్సీలలో 4లక్షల 10వేల 404 కనెక్షన్లు ఉన్నాయి. 4లక్షల 11వేల 348 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా 3లక్షల 20వేల 650 మందిని వంట గ్యాస్ రాయితీ పొందేందుకు అర్హులుగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు.

ఈ పథకాన్ని నగదు బదిలీ విధానంలో చేపట్టేందుకు పౌరసరఫరాల శాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ విధానం ప్రకారం లబ్ధిదారులు గ్యాస్ తీసుకునే సమయంలో మొత్తం ధర చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత ఆ మొత్తంలో రూ.500 పోను మిగతా మొత్తాన్ని రాయితీ రూపంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో బదిలీ చేస్తుంది. ఐదు నెలల క్రితం వరకు గ్యాస్ ధర రూ.1137 వరకు ఉండగా ప్రస్తుతం రూ.937 ధర ఉంది. గతంలో వినియోగదారుల ఖాతాల్లో ఎక్కువ మొత్తంలో రాయితీ జమ కాగా కొన్ని నెలలుగా తక్కువగా అంటే రూ.17.50, రూ.18 మాత్రమే జమ అవుతోంది. దీంతో సామాన్యులు గ్యాస్ రాయితీపై అంతగా ఆసక్తి చూపడంలేదు. తాజాగా రూ.500కే గ్యాస్ వస్తే నిరుపేదలపై రూ.400లకు పైగా భారం తగ్గనుంది.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా

సింగిల్	201640
డబుల్	78,023
దీపం పథకం	59,742
సీఎస్ఆర్ కనెక్షన్లు	23,688
ఉజ్వల	47,311
మొత్తం	4,10,404

ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల వివరాలు

మండలం/ మునిసిపాలిటీ	కుటుంబాలు	దరఖాస్తులు
20 మండలాలు	3,39,788	425841
4 మునిసిపాలిటీలు	131637	124011
మొత్తం	**471425**	**549852**

రాయితీ సొమ్ము జమ చేస్తాం..

చందన్‌కుమార్, డీఎస్‌వో

జిల్లాలో అర్హులైన గ్యాస్ లబ్ధిదారులకు రాయితీ సొమ్మును ప్రభుత్వం ఆయా ఖాతాల్లో జమ చేస్తుంది. ఇప్పటివరకు 2లక్షల 16వేల మందిని అర్హులుగా గుర్తించాం. మిగిలిన వాటిని కూడా పరిశీలించిన తర్వాత వాటికీ వర్తింప చేస్తాం. తొలుత లబ్ధిదారులు రూ.937లతో సిలిండర్ కొనుగోలు చేస్తే 500 పోను మిగిలిన సొమ్ము లబ్ధిదారుల ఖాతాకు జమ అవుతాయి. ఈ నెల నుంచి ఈ పథకం జిల్లాలో అమలుకానుంది.

3,50,000 మంది...

- 'గృహజ్యోతి' కింద ఉచిత విద్యుత్ పొందే లబ్ధిదారుల సంఖ్య

6



పెరుగుతున్న పత్తి ధర

ఖమ్మం మార్కెట్‌లో క్వింటాలు రూ.7,600

ఖమ్మం మార్కెట్ ఫిబ్రవరి 29: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో ధరలు ఊపందుకున్నాయి. మార్కెట్‌లో గురువారం క్వింటాలు పత్తిని రూ.7,600 ఆన్‌లైన్ బిడ్డింగ్ ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో నెలరోజుల క్రితం క్వితాలు రూ.6,500 పలికిన పత్తి ధర నాటి నుంచి రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. నెలరోజుల వ్యవధిలోనే క్వింటాలకు రూ.1,000కు పైగా పెరగడం విశేషం. పత్తికి ఈ ఏడాది జనవరి నుంచి మార్చివరకు అంతర్జాతీయంగా, దేశీయంగా మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది. దీంతో పత్తి సీజన్ ప్రారంభంలో క్వింటాలు రూ.7,000 నుంచి రూ.8,000 వరకు పలికిన పత్తి ఆ తరువాత క్వింటాలు రూ.5,500 నుంచి రూ.6,000 వరకే కొనుగోలు చేశారు. ప్రస్తుతం రైతుల వద్ద పంట నిల్వలు లేకపోవడంతోపాటు దేశీయంగా ఆర్డర్లు రావడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. గత 2022లో పత్తికి ఖమ్మం మార్కెట్‌లో అత్యధికంగా క్వింటాలుకు రూ. 13,050వరకు రికార్డు ధరలు లభించాయి. కానీ ఈ ఏడాది పత్తికి అంతగా డిమాండ్ లేకపోవడంతో ధరలు ఊపందుకోలేదు. కాగా పత్తికి కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధర గతేడాది క్వింటాలుకు రూ.6,380 కాగా ఈ ఏడాది క్వింటాలుకు రూ.646 పెంచి రూ.7,026లుగా నిర్ణయించారు.

బీఆర్ఎస్ పాలన అవినీతి మయం

- కాళేశ్వరం పేరుతో తిన్నదంతా కక్కిస్తాం
- ధరణి పేరుతో చేసిన భుకబ్జాలను వెలికితీస్తాం
- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట/అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 29: పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతిమయంగా సాగిందని, అభివృద్ధి పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకొని కల్వకుంట్ల కుటుంబం ధనిక రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పులపాలు చేసిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా భద్రాద్రి జిల్లా దమ్మపేటలో గురువారం అశ్వారావుపేట నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు రావాలని, ఇందిరమ్మ రాజ్యం రావాలనే తలంపుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తెలుగుదేశం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరంతరం శ్రమించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అశ్వారావుపేట వంటి చిన్న నియోజకవర్గంలో బడాబాబులు, గ్రానైట్ వ్యాపారులు డబ్బుల సంచులతో వచ్చినా ఓట్లన్నీ గంపగుత్తగా కాంగ్రెస్‌కే పడ్డాయన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం అన్యాయాలు, అక్రమాలు, భూకబ్జాలు, దోపిడీలకు నిలయంగా మారిందని ధ్వజమెత్తారు. ఆనాడు మంత్రివర్గం మేడిగడ్డకు వెళితే బొందలగడ్డకు వెళ్లారని విమర్శించిన కొందరు నేడు అదే మేడిగడ్డ వద్దకు ఎందుకు వెళుతున్నారో చెప్పాలన్నారు. మిగులతో నిధులతో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నేడు అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్నో ఆశలతో ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల్లోనే రెండు పథకాలు అమలు చేశామని తెలిపారు. రెండు రోజుల క్రితమే 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. మరో రెండు పథకాలను కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా కాకముందే కొందరు ప్రబుద్ధులు విమర్శలు చేస్తున్నారని, ఒక వేలు చూపిస్తే నాలుగు వేళ్లు మనవైపు చూపుతాయని తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎవరు ఉన్నా అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అశ్వారావుపేట నుంచే ప్రారంభమైందన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, టీడీపీ నియోజకవర్గ నాయకులు కట్రం స్వామిదొర, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు బొర్రా రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 'గృహజ్యోతి'
లబ్ధిదారులు 3,50,000 మంది

- 200 యూనిట్ల లోపు వినియోగించిన వారికే అవకాశం
- 200 దాటి ఒక యూనిట్ అధికంగా వినియోగించినా మొత్తం బిల్లు కట్టాలి...
- అర్హత పొందిన వారికి జీరో బిల్
- ఈ నెల నుంచే అమలుకు రంగం సిద్ధం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 29: ప్రజాపాలన గ్రామ సభల్లో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసిన వారిలో అర్హులకు 'గృహజ్యోతి' పథకం శుక్రవారం నుంచి అమలులోకి రానుంది. అర్హత పొందిన లబ్ధిదారుల జాబితా ఇప్పటికే టీఎస్ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి చేరింది. గుర్తింపు పొందిన లబ్ధిదారుల నివాసాలకు విద్యుత్ మీటరు రీడింగ్ సిబ్బంది వెళ్లి రీడింగ్‌నమోదు చేస్తారు. 200 యూనిట్లులోపు విద్యుత్ వినియోగం జరిగితే వెంటనే జీరో బిల్లును లబ్ధిదారులకు అందించనున్నారు. ఒకవేళ 201 యూనిట్ల వినియోగం జరిగితే మాత్రం మొత్తం బిల్లును చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఏ నెలలో 200లోపు విద్యుత్ వినియోగం జరిగితే అదే నెలకు మాత్రమే 'గృహజ్యోతి' పథకం అమలు జరుగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుర్తించిన లబ్ధిదారులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు జరిగింది. ఆయా లబ్ధిదారులు కూడా ఈ పథకంలో 200యూనిట్లు లోపు ఉచిత విద్యుత్‌కు అర్హత పొందుతారు. తొలి విడతగా జిల్లాలో కేటగిరి- 1లోని 3.5లక్షల గృహ వినియోగదారులకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని విద్యుత్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం కూడా తెల్లరేషన్ కార్డు ఉన్న వారికే వర్తించనుంది.

ఇంకా అవకాశం ఉంది...

●సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్, ఖమ్మం జిల్లా

మార్చి 1 నుంచి ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న 'గృహజ్యోతి' అర్హత పొందిన విద్యుత్ వినియోగదారులకు పథకం అమలులోకి వస్తుంది. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన వారికి ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి జరిగింది. అర్హత పొందిన వారికి 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలు జరుగుతుంది. విద్యుత్ మీటరు రీడింగ్ సమయంలో జీరో బిల్లులు జారీ చేస్తాం. అర్హత ఉండి ఇప్పటివరకు 'గృహజ్యోతి' ఉచిత విద్యుత్ పథకానికి దరఖాస్తులు చేయని వారికి ఇంకా అవకాశం ఉంది.. అర్హులు సంబంధిత ఎంపీడీవో, పురపాలక, నగర పాలక సంస్థ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేయాలి. మీటరు నెంబర్, మొబైల్, ఆధార్ నెంబర్‌తో అనుసంధానం చేస్తూ దరఖాస్తులు చేయాలి. 'గృహజ్యోతి' పథకంపై అర్హత కలిగిన వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

4న సత్తుపల్లిలో ప్రజావాణి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 29: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వచ్చే సోమవారం (మార్చి 4న) సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ వీపీ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత దగ్గరిగా నిర్వహించాలన్న లక్ష్యంతో ఈసారి సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

వైరాలో చోరీ

రూ.రెండులక్షల ఆభరణాల అపహరణ

వైరా, ఫిబ్రవరి 29: వైరా మునిసిపాలిటీ తొమ్మిదో వార్డు పరిధిలోని కమ్మవారి కల్యాణ మండపానికి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రూ.రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ధరావత్ లచ్చానాయక్, నాగమణి దంపతులు తమ కుమార్తె ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షల కోసం బుధవారం రాత్రి కొత్తగూడెం బయల్దేరి వెళ్లారు. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ చిందరవందర చేసి, బీరువాలో ఉన్న రూ.రెండులక్షల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు గురువారం లచ్చానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైరాలో గురువారం పట్టపగలు ఆర్ఎంపీ వైద్యుడికి చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఆర్ఎంపీగా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్న పూర్ణకంటి ఏసుదాసుకు చెందిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. స్థానిక జడ్పీబాలికోన్నత పాఠశాల సమీపంలో గల ఓ ఇంట్లోని రోగికి వైద్యసేవలందించి బయటకు వచ్చిన దాసుకు తన వాహనం కన్పించలేదు. టీఎస్04ఈవీ6326 నెంబర్ కలిగిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం ఫిబ్రవరి 29: పలు శాఖలో ప్రభుత్వ ఉద్యోగులమని చెప్పి నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకులో రుణాలు ఇప్పించిన ముగ్గురు నిందితులను గురువారం ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగ్గిళ్ల విజయ్, నల్లగట్ల కరుణాకర్, నజీర్, ప్రశాంత్ అనే వారు కలసి కొందరు దళారులతో మాట్లాడి వివిధ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులమని చెప్పి వారి పేర్లపై నకిలీ వేతన ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. అదేవిధంగా సుమారు తొమ్మిది మంది వీరికి సహకరించి పలువురు పేరిట పట్టణంలోని ఓ బ్యాంకులో సుమారు రూ.60 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. వారి మధ్య తేడాలు రావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు గుగ్గిళ్ల విజయ్, నల్లగట్ల కరుణాకర్, కొటమర్తి దినేష్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో పట్టుకొని రిమాండ్ చేస్తామని పోలీసులు తెలిపారు. .

కాంగ్రెస్ నేతపై హత్యాయత్నం

- కొణిజర్లలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుల ఘాతుకం
- బాధితుడు సూరంపల్లి రామారావు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి ప్రధాన అనుచరుడు


రామారావు ఇంటి వద్ద జనం

కొణిజర్ల, ఫిబ్రవరి 29: ఖమ్మం జిల్లా కొణిజర్ల తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్‌నేత సూరంపల్లి రామారావుపై బుధవారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామారావు బుధవారం రాత్రి స్థానికంగా వివాహ కార్యక్రమానికి వెళ్లి వచ్చి రాత్రి 10:30 గంటల సమయంలో ఇంట్లో నిద్రించాడు. ఇంట్లో అతడితో పాటు తల్లి సుశీల కూడా ఉంది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటివెనుక తలుపుతీసుకొని బయటకు వచ్చిన రామారావు మళ్లీ తిరిగి ఇంట్లోకి వెళుతుండంగా గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు.

వెంటనే అప్రమత్తమైన రామారావు వారినుంచి తప్పించుకొని ఇంట్లోకి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లితో చెప్పి మళ్లీ బయటకు వచ్చి కేకలు వేశాడు. అదే సమయంలో గ్రామంలో అతడి ఇంటి సమీపంలో వివాహం జరగ్గా స్థానికులు అక్కడ ఉండటంతో రామారావు అరుపులు విని అతడి వద్దకు వచ్చారు. రక్తమోడుతున్న రామారావును వెంటనే ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతడి కడుపు భాగంలో కత్తిపోటు బలంగా ఉండటంతో ఎక్కువగా రక్తస్రావమైంది.

ఈ విషయం తెలుసుకున్న వైరా ఏసీపీ రహమాన్, సీఐ సాగర్, కొణిజర్ల ఎస్ఐ శంకర్‌రావు వెంటనే రామారావు ఇంటి వద్దకు చేరుకున్నారు. తరువాత ఖమ్మంలో అతడు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి ఘటనపై రామారావు నుంచి కొన్ని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తనపై దాడి చేసినవారిలో ఇద్దరి పేర్లను రామారావు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. గ్రామంలో అనుమానితులుగా భావిస్తున్న ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

అయితే దాడి వెనుక కారణాలు తెలియరాలేదు. దాడి చేసినవారికి రామారావుకు పాత కక్షలున్నాయా.. లేక మరేవైనా సమస్యలున్నాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కొణిజర్ల ఎస్ఐ శంకర్‌రావు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు సూరంపల్లి రామారావుపై కత్తులతో దాడి చేశారని, ఘటనపై పూర్తిగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. రామారావుపై దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో దాడికి వచ్చిన వారిలో ఒకరి టీషర్టు సంఘటనా స్థలంలో పడి పోయిందని తెలిపారు. ఇదిలా ఉండగా తన ప్రధాన అనుచరుడైన సూరంపల్లి రామారావుపై జరిగిన దాడి ఘటనపై రేణుకాచౌదరి ఆరా తీశారు. తన పీఏను ఖమ్మంలోని ఆసుపత్రి వద్ద ఉంచి ఎప్పటికప్పుడు సూరంపల్లి ఆరోగ్యవిషయాన్ని తెలుసుకుంటున్నారు.

ఉలిక్కిపడ్డ కొణిజర్ల...

రామారావుపై హత్యాయత్నం జరగటంతో కొణిజర్ల గ్రామ ఉలిక్కిపడింది. దాడి విషయం తెలుసుకొని భారీసంఖ్యలో గ్రామస్థులు ఆయన ఇంటివద్దకు చేరుకున్నారు. ఆయన వెంటనే కోలుకోవాలని కాంగ్రెస్ నాయకులు స్థానిక రామాలయంలో పూజలు చేశారు. గతంలోనూ కొందరు వ్యక్తులు కారులో మాస్కులు ధరించి వచ్చి తుపాకితో రామారావును బెదిరించారు. ఆ చర్యకు పాల్పడింది ఎవరనేది నేటికీ నిర్ధారణ రాలేదు.

రఘునాథపాలెంలోనూ....


చలపాటి హరిను అడ్డుకుంటున్న స్థానికులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 29: అక్రమం మైనింగ్, కంకర, మినరల్ వాటర్‌ప్లాంట్ వ్యాపారం చేస్తున్నారని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసిన, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడి ఇంటి మీదకు వెళ్లి ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన రఘునాథపాలెం మండల కేంద్రంలో చోటు చేసుకొంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా మందా బుచ్చిబాబు కొనసాగుతున్నారు. గురువారం ఉదయం బుచ్చిబాబు తన కుమారుడు మందా ఆజిత్‌ను పాఠశాలలో దించి, తిరిగి ఇంటికి చేరుకోగా కార్లు, ద్విచక్ర వాహనాలపై ఆదే గ్రామానికి చెందిన చలపాటి శంకర్, చలపాటి హరిబాబు వచ్చారు. మా వ్యాపారం గురించి నీకేందుకు అంటూ ఒక్కసారిగా రాళ్లతో మందా బుచ్చిబాబుపై దాడికి దిగారని తెలిపారు. దాడిలో బుచ్చిబాబుకు, హరికి తీవ్ర గాయలయ్యాయి. దాడి విషయాన్ని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్‌కు ఫోన్‌లో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేరాల నియంత్రణకు ప్రణాళికతో ముందుకెళ్లాలి: సీపీ


మాట్లాడుతన్న సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి29: వ్యవస్థీకృత నేరాల నియంత్రణకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్లడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. ప్రతినెలా నిర్వహించే నేరసమీక్షా సమావేశంలో భాగంగా గురువారం పోలీసు కాన్ఫరెన్సు హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో విధిగా విజుబుల్ పోలీసింగ్ అమలు చేయాలని తద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్ర మరవాణా జరగకుండా చూడాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి ఇసుక అక్రమంగా తరలించే వాహనాలు, దొరికినవి సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా నేను సైతం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిం చేలా చూడాలన్నారు. ఈసమావేశంలో ఏడీసీపీ గణేష్, ఏసీపీలు రమణమూర్తి, రఘు, ప్రసన్నకుమార్, సాంబరాజు, పాల్గొన్నారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతిని అభినందించిన సీపీ

ఖమ్మంక్రైం: ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఓ యువతిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ గురువారం తన కార్యాలయంలో అభినందించారు. పోలీసు శిక్షణ కేంద్రంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న శృతి తల్లి పుల్లమ్మ తండ్రి పెయింటర్‌గా పనులు చేస్తూ జీవిస్తున్నారు. పెద్దకుమార్తె శృతి ఇటీవల వెలువడిన ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లలో 4 ఉద్యోగాలు సాధించింది. ఎక్సైజ్ కానిస్టేబుల్, గురుకుల స్కూల్ లైబ్రేరియన్, ఈవో ఉమెన్ ఛైల్డ్ వెల్ఫేర్, గురుకుల డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఉద్యోగాలు సాధించింది. ఈ నేపథ్యంలో సీపీ వారి కుటుంబసభ్యులను, శృతిని అభినందిం చారు. ఈకార్యక్రమలో సీటీసీ ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 29: కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారు లతో పెండింగ్ కోర్టు కేసులపై ఆయన సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి టైం బాండ్ కేసు లు, డైరెక్షన్స్, ధిక్కార, రిట్ పిటిషన్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు. రిట్ పిటిషన్లపై సరైన కౌం టర్లు ఫైల్ చేయాలన్నారు. ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకో వాలని ఆయన అన్నారు. టైం బాండ్ కేసులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డైరెక్షన్ మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కేసుల పరిష్కారంపై వారం వారం సమీక్ష చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీపీవో హరికిషన్, డీఈవో సోమశేఖరశర్మ, మత్స్య శాఖ ఏడీ ఆంజనేయస్వామి, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, కలెక్టరేట్ సూపరింటెం డెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 29: 2022-23 సంవత్సరం వరకూ బకాయి ఉన్న ఆస్తిపన్నులపై విధించిన మొత్తం వడ్డీపై 90శాతం రాయితీ ఇస్తున్నట్లు నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఒక ప్రకటనలో తెలిపారు. బకాయి ఉన్న పూర్తి ఇంటిపన్ను చెల్లించిన వారికే వడ్డీరాయితీ ఉం టుందన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా మార్చి 31 వరకు బకాయిలు చెల్లించి, వడ్డీపై 90శాతం రాయితీ పొం దవచ్చని, ఆస్తిపన్నుల బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

సోమ, గురువారాల్లో రెవెన్యూ మేళాలు

ఖమ్మంకార్పొరేషన్: ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాల యంలో ప్రతి సోమవారం, గురువారాల్లో రెవెన్యూమేళాలు నిర్వహించనున్నట్లు నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ మేళాలో ఇంటిపన్నుల హెచ్చుతగ్గులు, పంపు పన్నుల పేరు మార్పు లు, చేర్పులు, ఇంటినెంబరు సవరణ తదితర అంశాలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ మేళాలో వచ్చిన దరఖాస్తులను వారంరోజుల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

వనం నుంచి జన సంద్రంలోకి వన దేవతలు

కరకగూడెం, ఫిబ్రవరి 29: గురువారం వనం నుంచి వన దేవతలు గద్దెలపై కొలువు తీరాయి. కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి పంచాయతీ కుర్నవల్లి పరిధిలోని సమ్మక్క, సారలమ్మ జాతర మూడు రోజులుగా అంగరంగా వైభవంగా జరిగింది. మంగళవారం మండెమెలుగు కార్యక్రమంతో మెదలైన జాతర బుధవారం సారలమ్మ గద్దెలపైకి చేరగా.. గురువారం నందిగామ గుట్ట నుంచి సమ్మక్క, పగిడిద్దెరాజును పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించుకొని తీసుకొని వస్తున్న క్రమంలో మార్గం మధ్యలో వనదేవతలు ఎదురుకోలు నిర్వహించుకున్నారు. వనదేవతలను గద్దెలపై కొలువు తీర్చారు. రాత్రి 12 గంటలకు సమ్మక్క, పడిగిద్దెరాజుకు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు


జాతరలో పాల్గొన్న ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం:మండలంలోని మారాయిగూడెం జాతరలో మూడో రోజైన గురువారం సమ్మక్క గద్దెలపై కొలువు తీరింది. దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ సీతమ్మ, అన్నె సత్యనారాయణమూర్తి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కౌలు రైతు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్,ఫిబ్రవరి29: ముదిగొండ మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన మేడవరపు మోహన్‌రావు రూ. 16లక్షల 85వేల రూపాయలకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. ఆయన కౌలువ్యసాయం చేశాడు. పెట్టుబడి కోసం బంధువుల, స్నేహితుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని సాగు చేశాడు. సరిగా పంట పండక పోవటం, నష్టం రావటంతో రుణదాత నుంచి ఒత్తిడి అధికమవటంతో మొత్తం 11 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ తన న్యాయవాదులు పలివెల శ్రీలక్ష్మీ, మద్దిల నవీన్‌కుమార్ ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన భార్యభర్తల అరెస్టు

కారేపల్లి, ఫిబ్రవరి29: మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాకు చెందిన భార్యభర్తలు పలువురికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద రూ.కోటి87 లక్షలకుపైగా అక్రమ వసుళ్లకు పాల్పడిన గుగులోత్ ప్రేమ్‌కుమార్, అతని భార్య బానోత్ శోభనను గురువారం కారేపల్లి సీఐ బి.తిరుపతిరెడ్డి అరెస్టు చేసి ఇరువురిని రిమాండ్‌కు పంపించారు. గతంలో భార్యభర్తలు చేసిన అప్పులను తీర్చేందుకు ఉద్యోగాల పేరుతో అనేక మందిని మోసం చేశారు. వీరి వద్ద నుంచి స్కూటీ, 5సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌తో పాటు కొన్ని నకిలీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి29: మైనర్ డ్రైవింగ్‌లపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీని వాస్ తెలిపారు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదదాల సంఖ్య గననీయంగా పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, రోడ్డు ప్రమాదాలకు ముఖ్యకారణం మద్యంతాగి వాహనాలునపడం, మైనర్ డ్రైవింగ్ చేయడమేనని తెలిపారు. ఇటీవల వాహనాలు నడుపుతూ పట్టుబడిన 59మంది మైనర్ల వాహనాలను సీజ్ చేసి వారి తల్లిదండ్రుల సమోంలో కూడా కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. అదేవిధంగా నెంబరు ప్లేటు లేకుండా తిరుగుతున్న 54వాహనాలను సీజ్ చేసి నెంబర్లు ప్లేట్లు తీసుకువచ్చిన తర్వాత వాహన దారులకు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్‌రావు, ఎస్ఐ రవి, ఆర్ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణలో యువత పాత్ర ముఖ్యం

● జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ప్రోగ్రాం అధికారి సత్యకుమార్


ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి29: ఎయిడ్స్ రహిత నవసమాజాన్ని నిర్మించడంలో చదువుకున్న యువత పాత్ర ఎంతైనా ఉందని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ప్రొగ్రాం అధికారి సత్యకుమార్ అన్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులే ఎయిడ్స్‌పై ప్రజలకు వివరించాలని, హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలంతా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, నియంత్రణ విభాగ బాధ్యులు గండె రమేష్, నరసింహారావు, డాక్టర్ శ్రీనివాసరావు, నాగమణి, కుబేరుడు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కే.రామకృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయిన్నపాలెం వాసి శ్రీనివాస్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్

చంద్రుగొండ, ఫిబ్రవరి 29: చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన బూరుగు శ్రీనివాస్ ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవతరగతి వరకు చదవగా, డిగ్రీ, పీజీ కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం 2008లో జూనియర్ అధ్యాపకుడిగా ప్రభుత్వం ఉద్యోగం పొందారు. ప్రస్తుతం హన్మకొండ కాకతీయ కళాశాలలో పనిచేస్తున్నారు. కాగా శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర సహాచార్యులు డాక్టర్ హిమబిందు పర్యేక్షణలో ఎఫెక్ట్ ఆఫ్ బిస్మత్, లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్ ఆన్‌ఫిజికల్ తదితర విభాగాల్లో పరిశోధనలకు గాను డాక్టరేట్ సాధించారు. మండలం నుంచి తొలి డాక్టరేట్ సాధించిన శ్రీనివాస్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయలు అభినందిచారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం

● సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య


మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

సుజాతనగర్, ఫిబ్రవరి 29: సుజాతనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అండగా ఉంటాం.. అధైర్యపడకండని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. గురువారం సుజాతన గర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని వెంచర్‌లో 2013లో జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన సుమారు 120 మంది సర్వే నంబర్ 1536లో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఒక్కో ప్లాటుకు సుమారు రూ.2 లక్షల పై చిలుకు మొత్తాన్ని వాయిదా పద్ధతిలో చెల్లించి తమ ప్లాట్లను సొంతం చేసుకున్నారు. అయితే ప్లాట్లను విక్రయించిన సదరు వ్యక్తి వీరి పేరున 1536వ సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా... ఇతర నెంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయడమో కాకుండా ఒక ప్లాటును ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేయించాడు. తాము కొనుగోలు చేసిన స్థలాలు ఇతర నెంబర్లతో డబుల్ రిజిస్ట్రేషన్ చేయించిన విషయం తెలుసుకున్న వీరంతా నాటి నుంచి ప్లాట్లకోసం తిరుగుతూ ఉన్నారు. కాగా బాధితులు కొనుగోలు చేసిన స్థలం పాల్వంచకు చెందిన మరో వ్యక్తి పేరున తాకట్టులో ఉండటంతో సదరు యజమాని సైతం వీరిని ప్లాట్లలోకి రానీకుండా అడ్డుకుంటున్నాడు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌ను, కోర్టును కూడా ఆశ్రయిం చారు. బాధితులకు ప్లాట్లు అప్పగించే విషయంలో పలుమార్లు చర్చలు జరిగినా సమస్య కొలిక్కిరాలేదు. దీంతో ఇన్నాళ్లు నిరీక్షించిన బాధితులు ప్లాట్ల వద్దకు చేరుకుని హద్దు రాళ్లను సరి చేసుకుని, గతంలో ఉన్న రంగు స్థానంలో మరో రంగు వేశారు. ఈ సందర్భంగా బాధితులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీరు చేస్తున్న న్యాయపోరాటానికి మేమూ కూడా సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల పక్షాన నిలబడి వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తల్లాడ, ఫిబ్రవరి 29: లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఈ సంఘటన గురువారం తల్లాడ మండలం ఎన్టీఆర్‌నగర్ సమీపంలో తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి బొగ్గు లోడ్‌తో జగ్గయ్యపేట వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన లారీ క్లీనర్ ఒంటిపులి సాంబయ్య(50)అక్కడికక్కడే మృతి చెందాడు. జగ్గయ్యపేటకు చెందిన లారీ డ్రైవర్ సీహెచ్.లక్ష్మీనారాయణ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లాడ పోలీసులు సంఘటనాస్థలానికి క్రేన్‌తో చేరుకొని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు ఏడాది జైలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 29: ఖమ్మం పట్టణం బ్యాంక్ కాలనీకి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితురాలు బాణోత్ మమతకు ఖమ్మం మద్యపాన అబ్కారి ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత నిందితురాలికి ఏడాది జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి నష్టపరిహారం చెల్లించాలని గురువారం తీర్పును వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణం శుక్రవారిపేటకు చెందిన ఫిర్యాది షేక్ జమాలుద్దీన్‌బేగం వద్ద నిందితురాలు తన కుటుంబ అవసర నిమిత్తం 2017లో రూ.లక్షా60వేలను చేబదులుగా తీసుకుంది. ఫిర్యాదు రుణం చెల్లించాలని ఒత్తిడి చేయగా బ్యాంక్ చెక్కును ఇచ్చింది. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా నిందితురాలి చెక్కు మీద ఉన్న సంతకం తేడా వలన అట్టి చెక్కు తిరస్కరణకు గురైంది. ఈ విషయమై కోర్టులో కేసు దాఖలు చేసింది. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఆరు నెలల జైలు ..

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి29: తీసుకున్న డబ్బులు ఇవ్వనందున ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరికి సత్తుపల్లి జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్‌కే.ఆయేషాషరీన్ జైలుశిక్ష విధించిన సంఘటన సత్తుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలంలోని పాకలగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అమిదేపురం హరికిరణ్‌కుమార్ 2016 డిసెంబర్ 20వ తేదీన సత్తుపల్లి పట్టణానికి చెందిన గోళ్ల సూర్యచంద్రరావు వద్ద రూ.8లక్షలు కుటుంబ అవసరాల నిమిత్తం అప్పుగా తీసుకున్నారు. ఫిర్యాదు దారుడు తన డబ్బు లు చెల్లించమని ఒత్తిడి చేయగా, ఏడాది తర్వాత బాధితుడికి హరికిరణ్ బ్యాంక్ చెక్‌ను ఇవ్వగా, అది చెక్‌బౌన్స్ అయ్యింది. దీంతో ఫిర్యాది కోర్టును ఆశ్రయించాడు. వాదనలు విచారించిన న్యాయాధికారిణి ఎస్.ఆయేషాషరీన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు హరికిరణ్‌కు 6నెలల జైలుశిక్షతో పాటు రూ.16లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితుడు సూర్యచంద్రరావు తరపున సీనియర్ న్యాయవాది ఎస్‌కే.బుజ్జీసాహెబ్ వ్యవహరించారు.

డిటోనేటర్లు పట్టివేత

ముదిగొండ, ఫిబ్రవరి 29: ముదిగొండ మండలం కమలాపురం వద్ద గురువారం డిటోనేటర్స్ జిలెటిన్‌స్టిక్స్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ గజ్జల నరేష్ తెలిపారు. కంప్రెషర్ ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న పది డిటోనేటర్లు, 80జిలెటిన్‌స్టిక్స్, మేకర్ బాక్సు, రెడ్‌వైర్ బండిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ పేలుడు పదార్థాలతోపాటు కంప్రెషర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో యువకుడి అరెస్టు

భద్రాచలం, ఫిబ్రవరి 29: భద్రాచలంలో ఈనెల 17న ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు తమ్మళ్ల మాణిక్యం మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భద్రాచలం పట్టణ ఎస్ఐ పీవీఎన్‌రావు తెలిపారు. గురువారం జగదీష్ కాలనీకి చెందిన ఒగ్గిరాల అభిలాష్‌ను అదుపులోనికి తీసుకుని విచారించామన్నారు. చనిపోయిన మాణిక్యం మనుమళ్లతో తనకు గతంలో స్నేహబంధం ఉందని ఈ క్రమంలో వారితో తరచూ గొడవలు జరుగుతుండేవని పేర్కొనట్లు తెలిపారు. దానిని మనసులో పెట్టుకొని వారిని ఏదైనా చేయాలనే మాణిక్యం మనుమళ్లు సాయంత్రం సమయంలో ఎస్ఆర్ఎస్ కాలనీ లోని వాళ్ల ఇంటికి వస్తారని తెలుసుకొని అక్కడికి వెళ్లినట్లు తెలిపారు అన్నారు. ఆమె మనుమళ్లు లేకపోయేసరికి వారిని భయపెడదామనే ఉద్దేశంతో అక్కడ ఉన్న కర్రతో ఆమె తలపై కొట్టగా ఆమె స్పృహతప్పి కిందపడిపోయిందన్నారు. ఆమెను తీసుకొని వెళ్లి ఆమె బెడ్‌రూమ్‌లో పడివేసి ఆమె చనిపోయిందని అక్కడ నుంచి పారిపోవటం జరిగిందని చెప్పగా అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

కారేపల్లి, ఫిబ్రవరి29: ఏన్కూర్ మండలం పరిధిలోని అక్కినపురం గ్రామానికి చెందిన ధారవత్ బుజ్జి నాటుసారా అమ్ముతూ పట్టుబడ్డారు. ఇదే విషయంపై ఈనెల 27న ఎన్కూరు తహసీల్దార్ ఎదుట కారేపల్లి ఎక్సైజ్ సీఐ ప్రశాంతి హాజరుపర్చారు. గతంలో బైడంవర్ ఉల్లఘిం చిన బుజ్జికి రూ.లక్ష జరిమానాతో పాటు 220 రోజులు జైలు శిక్ష విధించారు. అయితే బాధితు రాలు కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు రూ.లక్ష కాకుండా రూ.60వేలు జరిమానా చెల్లించేం దుకు అంగీకరించడంతో పాటు వెంటనే చెల్లించారు. దీంతో గురువారం జైలు నుంచి బుజ్జిని విడుదల చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్ఐ వసంతలక్ష్మి, వెంకటేశ్వర్లు, పార్థసారధి, సత్యనారాయణ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





అడుగంటిన వైరా నది

- పుష్కరకాలం తర్వాత ఎండిన నది
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

వైరా, ఫిబ్రవరి 29: జాలిముడి ఆనకట్ట సమీపంలో వైరా, కట్లేరు నదులు పూర్తిగా ఎండిపోయాయి. పుష్కర కాలం తర్వాత ఈ ఈ రెండు నదులు ఎండిపోయాయి. ఫిబ్రవరిలోనే నది ఎండిపోతే... ఈ వేసవి మూడ్నాలుగు నెలలు కరవు పరిస్థితిని తలుచుకుంటే తీవ్ర ఆందోళనగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే భూగర్భజలాలు తగ్గిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో వైరా, కట్లేరు అనుసంధానమయ్యే జాలిముడి ప్రాంతంలో ఆనకట్ట నిర్మించారు. ఇక అప్పటినుంచి ఈ ఆనకట్ట బ్యాక్‌వాటర్‌తో వేలాది ఎకరాల్లోని పొలాలు సస్యశ్యామలమయ్యాయి. తెలంగాణలోని మధిర, వైరా నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే జాలిముడి, మల్లారం, రొంపిమళ్ల, గన్నవరం, దాచాపురం, గరికపాడు, ఖానాపురం అలాగే ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి, ఉమ్మడదేవరపల్లి గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లోని పంటలకు జాలిముడి బ్యాక్‌వాటర్ ఎంతో ఉపయోగపడుతోంది. ప్రతీ ఏటా ఖరీఫ్, రబీల్లో పుష్కలంగా పంటలు పండుతున్నాయి. వైరా నది, కట్లేరుకు నేరుగా వ్యవసాయ మోటార్లు ఏర్పాటు చేసుకోగా.. కొందరు బోర్లు వేసుకున్నారు. జాలిముడి బ్యాక్‌వాటర్ వల్ల బోర్లలో పుష్కలంగా నీరుండేది. అయితే ఫిబ్రవరి చివరి నాటికే జాలిముడి ఆనకట్ట బ్యాక్‌వాటర్ మొత్తం అడుగంటిపోయింది. దాంతో వ్యవసాయ మోటార్ల ఫుట్ బాల్స్, పైపులైన్లు బయటకు కనిపిస్తున్నాయి. గతంలో మాదిరిగానే ఈ ఏడాది యాసంగిలో కూడా వందలాది ఎకరాల్లో రెండునెలల కిందట వరిసాగుచేశారు. ఈ పంట రైతు చేతికి రావడానికి మరో రెండునెలలు పడుతుంది. ఇప్పుడు పూర్తిగా నీరు లేకుండా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వైరా రిజర్వాయర్‌లో కూడా నీరు లేకపోవడంతో నీటి విడుదల సాధ్యం అయ్యే పరిస్థితి లేదు. దీంతో తాము సాగుచేసిన పంటలు పండక నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఎన్నెస్పీ నీటిని వైరా రిజర్వాయర్‌కు వదిలి అక్కడి నుంచి జాలిముడి ఆనకట్టకు నీరు సరఫరా చేసేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైరా నీరిచ్చి ఆదుకోండి

గుర్రాల కృష్ణారెడ్డి, రైతు, దాచాపురం



గత 12 ఏళ్లుగా మాకు ఇలాంటి పరిస్థితి రాలేదు. ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశా. ఇప్పుడు రెండునెలల పైరు ఉంది. పంట చేతికి రావడానికి ఏప్రిల్ వరకు నీరు అవసరం. మాకు వైరా నుంచి నీరు విడుదల చేసి పంటలను కాపాడాలి.

ఆయన వయస్సు 13... టెక్నికల్‌గా 52

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 29: ఆయన వయస్సు 13.. ఓ కళాశాలకు ఛైర్మన్. కానీ టెక్నికల్‌గా 52సంవత్సరాలు. 1972లో లీప్ సంవత్సరంలో జన్మించాడు. కానీ ఇప్పటివరకు మాత్రం గురువారంతో కలిపి 13సార్లు మాత్రమే జన్మదినం జరుపుకొన్నాడు. అందరిలా కాకుండా ప్రతి నాలుగేళ్లకోసారి తన జన్మదినం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, విద్యార్థుల నడుమ చేసుకోవడం అమితానందాన్ని ఇస్తుందని అంటున్నారు. ఆయనే శ్రీనారాయణ, వంశీవినయ్ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య. ఈసారి శ్రీనారాయణ కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు నడుమ బర్త్‌డే జరుపుకొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకే తాను ఇష్టపడతానని, తనకు సహకరిస్తూ శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



రామకృష్ణమాచార్యకు బహుమతిని అందిస్తున్న విద్యార్థినులు

నాలుగేళ్ల బాలుడు.. తొలి బర్త్‌డే


అయిలూరి లావీష్‌రెడ్డి

వైరా, ఫిబ్రవరి 29: ఖమ్మం జిల్లా వైరా మండలంలోని దాచాపురం గ్రామంలో నాలుగేళ్ల బాలుడు తొలి జన్మదిన వేడుకలను జరుపుకొన్నాడు. అందుకు లీప్ సంవత్సర మహత్యం. దాచాపురం గ్రామంలో అయిలూరి మహీంద్రారెడ్డి, శ్రీలత దంపతులకు 2020 ఫిబ్రవరి 29న లావీష్‌రెడ్డి జన్మించాడు. ఇక అప్పటి నుంచి ఫిబ్రవరి 29 రాలేదు. నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి 29 లీప్ సంవత్సరం రావడంతో లావీష్‌రెడ్డి తొలి బర్త్‌డే వేడుకలు బంధుమిత్రుల మధ్య ఘనంగా జరుపుకొన్నాడు. తల్లిదండ్రులు, తాతయ్య, నాయనమ్మలు లావీష్‌రెడ్డిని ఆశీర్వదించారు.

రామవరం ఎంసీహెచ్‌లో లీప్ డే రోజు 14 మంది జననం

చుంచుపల్లి, ఫిబ్రవరి29: లీప్ ఇయర్ సందర్భంగా భద్రాద్రి జిల్లా కేంద్రమైన రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో గురువారం 14 మంది జన్మించారు. భద్రాద్రి జిల్లాతో పాటు, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, పొరుగు రాష్ట్రమైన ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన మహిళలు రామవరం ఎంసీహెచ్‌లో చేరి లీప్ ఇయర్ రోజున ప్రసవం పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వీరబాబు, గైకాలజిస్ట్ డాక్టర్ సింధు, డాక్టర్ లతీఫ్, నర్సింగ్ సూపరింటెండెంట్ భువనేశ్వరీ, సిబ్బంది స్వప్న మేరి తదితరులు పాల్గొన్నారు.

వైరాలో నలుగురు జననం

వైరా, ఫిబ్రవరి 29: నాలుగేళ్లకోసారి వచ్చే ఫిబ్రవరి 29 లీప్‌డే నాడు వైరాలో నలుగురు పిల్లలు జన్మించారు. అది కూడా ఒకే ఆసుపత్రిలో ఈ నలుగురు జన్మించారు. ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు. స్థానిక డాక్టర్ కాపా మురళీకృష్ణ హాస్పిటల్‌లో గురువారం ఈ నాలుగు ప్రసవాలు జరిగాయి. వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురానికి చెందిన పిల్లి పూజిత, శ్రీనివాస్ దంపతులకు మగ బిడ్డ, గొల్లపూడికి చెందిన బల్లీ శిరీష, సాయిబాబా దంపతులకు మగ బిడ్డ, తల్లాడ మండలం గోపాలపేటకు చెందిన గుండ్ల రమాదేవి, రాఘవ దంపతులకు ఆడబిడ్డ, కొణిజర్ల మండలంలోని జంపాల నగర్‌కు చెందిన లావుడ్యా శ్రావణి, రామదాసు దంపతులకు ఆడబిడ్డ జన్మించారు. ఈ దంపతులను డాక్టర్ సుచరిత అభినందించారు.



మణుగూరు ఓసీ విస్తరణకు 812 ఏకరాలు

- భూ సేకరణకై రెవెన్యూ యంత్రాంగం కసరత్తు..
- ఆయా గ్రామాల్లో మార్చి 4, 6 తేదిల్లో గ్రామసభలు
- మణుగూరు ఓసీని సందర్శించిన సబ్ కలెక్టర్ సుమ
- భూ సేకరణపై తహసీల్దార్, సింగరేణి అధికారులతో సమావేశం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 29 : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం ప్రభుత్వాన్ని స్థలం కేటాయించాలని కోరింది. ఈ మేరకు 812 ఎకరాల 83 సెంట్ల స్థల సేకరణకు ప్రభుత్వ కసరత్తు ప్రారంభించింది. ఇందులో బాగంగానే రెవెన్యూ యంత్రాంగం ప్రాజెక్ట్ సమీప గ్రామాలైన రామానుజవరం, తిర్లాపురం గ్రామాల్లో భూ సేకరణకు సిద్ధమైంది. ఈ మేరకు ఏజెన్సీ పెసానిబంధనల్లో బాగంగా రామానుజవరం పంచాయతీ కార్యాలయంలో మార్చి 4న, తిర్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 6న గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే గ్రామ సభల నిర్వహణ విషయమై ఆయా పంచాయతీ సెక్రటరీలు, మండల తహశిల్దార్, పంచాయతీ ప్రత్యేక అధికారులకు బుధవారం సబ్ కలెక్టర్ (భూ సేకరణ అధికారి) టీ సుమ గ్రామ సభల నిర్వహణపై ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం భూ సేకరణ అదికారిణి సుమ మణుగూరులో పర్యటించారు. తహశిల్దార్ రాఘవరెడ్డి, సింగరేణి అధికారులతో మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసచారి కార్యాలయంలో సమావేశమై సేకరించాల్సిన భూమి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం భూ సేకరణకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టవలసిన పనులను సూచించారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి : తహశిల్దార్ రాఘవరెడ్డి

సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ విస్తరణ నిమిత్తం భూ సేకరణకై నిర్వహించే గ్రామ సభలను ఆయా గ్రామాల్లోని రైతులు, గ్రామ పెద్దలు, ఆయా పార్టీల ప్రతినిదులు తప్పక హజరై గ్రామ సభలను విజయవంతం చేయాలని మణుగూరు తహశిల్దార్ రాఘవరెడ్డి కోరారు. భూ సేకరణ కార్యక్రమంపై ఆంధ్రజ్యోతి తహశిల్దార్‌తో గురువారం ప్రత్యేకంగా మాట్లాడింది. భూ సేకరణ కోసం ఆయా గ్రామాల్లో డప్పు చప్పుల్లతో చాటింపు వేస్తున్నామని తహశిల్దార్ పేర్కొన్నారు. గ్రామ సభలకు భూ యజమానులు, రైతులు, పెద్దలు హజరై తమ అభిప్రాయాలు తెలిపాలని కోరారు. సింగరేణి అధికారులు కూడా భూ సేకరణ అధికారిణి ఉత్తర్వుల కాపీతోపాటు గ్రామ సభకు హజరు కావాలని సూచించారు.

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.1.81కోట్లు

భద్రాచలం, ఫిబ్రవరి 29: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి మొత్తం రూ.1,81,80,925 ఆదాయం సమకూరింది. స్థానిక చిత్రకూట మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవస్థానం హుండీల ద్వారా రూ.1,77,92,825 ఆదాయం రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.5,08,550 ఆదాయం వచ్చింది. అలాగే బంగారం 174 గ్రాములు, వెండి ఒక కేజీ 248 గ్రాములు వచ్చింది. వీటితోపాటు 1,115 యుఎస్ డాలర్లు, సౌత్‌ఆఫ్రికా రియాద్‌లు 1,000, కెనడా డాలర్లు 90, ఆస్ట్రేలియా డాలర్లు 145, జపాన్ యాన్‌లు 1,000, ఇంగ్లాండ్ ఫౌండ్‌లు 25, ఖతర్ రిగ్విన్‌లు 145, ఓమన్ బైసా 100తో పాటు ఇతర దేశాల కరెన్సీ కరెన్సీ వచ్చాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ హుండీ ఆదాయం 56 రోజులకు సంబంధించినదని దేవస్థానం అధికారులుతెలిపారు. జనవరి 3న హుండీ లెక్కింపు నిర్వహించారు.


హుండీ లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేస్తున్న ఈవో రమాదేవి

చిరుధాన్యాలతోనే మానవజాతి మనుగడ

- ప్రముఖ ఆహార, ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఖాదర్‌వలి
- ఖమ్మంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఖాదర్‌వలి

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 29: చిరుధాన్యాలు తీసుకుంటేనే మానవజాతి మనుగడ ఉంటుందని, లేదంటే మానవజాతి కనుమరుగైపోతుందని ప్రముఖ ఆహార, ఆరోగ్య నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఖమ్మం కమ్మ మహాజన సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో గురువారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ చిరుధాన్యాలలో అధిక శాతం పీచు పదార్థా లు ఉండటం వల్ల అవి మానవ శరీరానికి అండగా ఉండి అనారోగ్య సమస్యలను దరి చేరనివ్వకుండా చూస్తాయన్నారు. ఇతర దేశాలలో చిరుధాన్యాలపై అవగాహన లేకపోవ డంతో పాటు అక్కడ ఆహర అలవాట్లతో మానవ జాతి అంతరించిపో తోందన్నారు. ఆయా దేశాల్లో మనిషి సరాసరి జీవితం కాలం కేవలం 41 నుంచి 51 సంవత్సరాలే ఉం టుందన్నారు. వంద సంవత్సరాలకు పూర్వం మన పూర్వీకులు తీసుకున్న దంపుడు బియ్యం, రాగులు, సజ్జలు తదితర ఆహార నియామావళి వల్ల వారికి అప్పట్లో ఆరోగ్య సమస్యలు అంతగా లేవన్నారు. ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహార పదార్థాల వల్లనే మానవజాతి కనుమరుగైపోతోందన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు చిరుధాన్యాల అవశ్యకతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు, రైతునేస్తం ఫౌండేషన్ యడవల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

- భద్రాద్రి జిల్లాలో ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని పరీక్షకు అనుమతించని అధికారులు
- ఖమ్మం జిల్లాలో ఓ మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ఖమ్మం ఖానాపురంహవేలీ/ కొత్తగూడెం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 70 పరీక్షా కేంద్రాలలో ద్వితీయ సంవత్సరం (తెలుగు, హింది, ఉర్దు, సంస్కృతం) జనరల్ విద్యార్థులు 14,906 మందికి 14,524 మంది, హజరై 382మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2101 మందికి 2016 మంది హజరుకాగా, 85 మంది పరీక్షకు హజరుకాలేదని డీఐఈఓ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కలెక్టర్ గౌతమ్ నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లోని పరీక్షా కేంద్రాని పరిశీలించారు.

ఆలస్యంగా వచ్చి పరీక్ష కోల్పోయిన విద్యార్థిని

బూర్గంపాడు: పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని గురువారం పరీక్ష రాయలేకపోయాడు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పావని అనే విద్యార్థిని 20నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతి నిరాకరించడంతో వెనుదిరిగి వెళ్లిపోయింది.



కొత్తగూడెం, (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో రెండో ఏడాది పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా మొత్తం 9,416 మందికి హాల్ టికెట్లు మంజూరయ్యాయి. వాటిలో 7,487 మంది జనరల్ అభ్యర్థులు, 1,929 మంది ఒకేషనల్ అభ్యర్థులు ఉన్నారు. వారిలో 179 మంది జనరల్ విద్యార్థులు, 131 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారిణి సులోచనా రాణి తెలిపారు.

చూసిరాత కేసు నమోదు

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మెదటి రోజు సంస్కృతం పరీక్షలో ఒక చూసిరాత కేసు నమోదైందని డీఐఈవో రవిబాబు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండ ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి పరీక్షను చూసి రాస్తుండగా అదికారులు పట్టుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ అండర్- 14 రాష్ట్రస్థాయి క్రికెట్ విజేత ఖమ్మం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: జడ్చర్లలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో విజేతగా ఖమ్మం జిల్లా జట్టు నిలచింది. గురువారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో రంగారెడ్డి జిల్లా జట్టుపై 30 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. ప్రథమ బహుమతి సాధించిన జిల్లా క్రీడాకా రులను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహమూర్తి, జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు అభినందించారు.


విజేత జట్టు

2న దమ్మపేటలో కోర్టు ప్రారంభం

దమ్మపేట, ఫిబ్రవరి 29: దమ్మపేట కేంద్రంగా నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జీ, జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌ను శనివారం మధ్యాహ్నం ప్రారంభిస్తారని సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జీ, హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు.

విద్యా ప్రదాత గెంటేల నారాయణరావు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 29: వేలాది మంది విద్యార్థులకు జ్ఞాన వెలుగులు నింపి విద్యాప్రదాతగా చరిత్రలో నిలిచిన మహనీయుడు శ్రీరామ భక్త గెంటేల నారాయారావు అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో స్థలదాత మనవరాలు కొలిపాక అన్నపూర్ణ రాసిన శ్రీరామభక్త గెంటేల నారాయణరావు 'సంగ్రహ చరిత్ర' పుస్తకాన్ని కళాశాల వైస్ పిన్సిపాల్ డా. బి.వి.రెడ్డి, సైన్స్‌విభాగ వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, గెంటేల కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బి.వి.రెడ్డి మాట్లాడుతూ 1950 లోనే అప్పటి ప్రభుత్వానికి రూ.లక్ష కళాశాల కోసం విరాళముచ్చిన విద్యాదర్శకుడిగా కొనియాడారు. కళాశాలలోని గెంటేల నారాయణరావు విగ్రహనికి క్షీరాభిషేకం చేసి శద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రమాసత్యవతి, అటానమస్ కోఆర్డినేటర్ ఎం సుబ్రమణ్యం, డా. బీ వెంకన్న, కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్‌ప్రిన్సిపాల్

జర్నలిస్టుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం

- రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని క్యాంపు కార్యాల యంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన ఆ జిల్లా జర్నలిస్టులతో మంత్రి ముచ్చ టించారు. ఈ సందర్భంగా తాము ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి త్వరలోనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొందర్లోనే ఈ అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి, జర్నలిస్టులు అడుగున్న అన్ని అంశాలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మంత్రి పొంగులేటిని సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దుద్దుకూరి రామారావు, వెలుగు రాజేందర్, కల్లోజి శ్రీనివాస్, దాసరి వెంకటేశ్వర్లు, శంకర్‌తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న జర్నలిస్టులు

మహారాష్ట్ర టూ భద్రాచలం

పాదయాత్రగా వస్తున్న భక్తులు


పాదయాత్రగా వస్తున్న భక్తులు

కామేపల్లి, ఫిబ్రవరి 29: భద్రాద్రి రామయ్యపై భక్తితో ఓ ఐదుగురు మహరాష్ట్ర నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర చేపట్టారు. మహరాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా గణేష్‌పూర్ గ్రామానికి చెందిన సీతారాం, గోకులా, మాణిక్‌దంగర్, చాంగునా, దిలీప్ ఈ ఐదుగురు భద్రాచలం పాదయాత్రతో వస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు. అందులో బాగంగా వారు 30రోజుల క్రితం పాదయాత్ర చేపట్టారు. గురువారం నాటికి కామేపల్లి మండలం చేరుకున్నారు. ఇంకో మూడు రోజులలో గమ్యస్థానం చేరుకుంటామని తెలిపారు.

పాల్వంచలో గంజాయి పట్టివేత?

పాల్వంచ, ఫిబ్రవరి 29: పాల్వంచలో టౌన్ పోలీసులు గురువారం రాత్రి గంజాయిని పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. భద్రాచలం నుంచి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 150 కిలోల ఎండు గంజాయిని ఇందిరాకాలనీ పెట్రోల్ బంక్ ప్రాంతంలో పాల్వంచ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తుంది. వాహనంలో ఉన్న మూడు మూటలను పరిశీలించగా అందులో ఎండు గంజాయి బయటపడింది. గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే విచారణ నిర్వహిస్తాం

- బాధ్యులెవరైనా చర్యలు తప్పవు
- దేవస్థానం ఈవో రమాదేవి
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

భద్రాచలం, ఫిబ్రవరి 29: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జానకిసదనంకు సంబంధించి గతంలో ఓ సంస్థ సభ్యులు ఇచ్చిన నగదు వ్యవహారంపై తగిన ఆధారాలతో దేవాదాయ శాఖ కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తే విచారణ నిర్వహిస్తామని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పేర్కొన్నారు. మూడున్నరేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన సదరు సంస్థ సభ్యులు దేవస్థానం ఉద్యోగులను సంప్రదించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ క్రమంలో సదరు ట్రస్టుకు సంబంధించిన సభ్యులు హైదరాబాద్‌లోనే ఉంటుండటంతో కమీషనర్‌కు ఫిర్యాదు చేయాలని వారికి సూచించినట్లు ఈవో తెలిపారు. భద్రాచలంలో గురువారం విలేకర్లతో ఈవో రమాదేవి మాట్లాడారు. జానకి సదనం నిర్మాణం చేపట్టాలని దేవస్థానం నిర్ణయించిన సమయంలో సదరు ట్రస్టుకు సంబంధించిన సభ్యులు దేవస్థానం కొంత మంది ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోందన్నారు. ఈ క్రమంలో సదనం నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో పేర్కొనగా ఈ క్రమంలో దేవస్థానంలోని సదరు ఉద్యోగులకు రూ.10 నుంచి రూ.15 లక్షలు ఇచ్చారని అంటున్నారు అది ఎంతో ఎలా ఇచ్చారో తమకు తెలియదని కాని అదేదో ఇచ్చారని అంటున్నారని ఈవో పేర్కొన్నారు. నిన్న అవుట్ ఆఫ్ స్టేషన్‌లో మేము ఉన్న క్రమంలో ట్రస్టుకు సంబంధించిన సభ్యులు, దాతలు మా ఉద్యోగులు మాట్లాడుకున్నారని తెలిసింది. ట్రస్టుకు సంబందించిన ఒక సభ్యురాలు మూడు నెలల కిందట తమను సంప్రదించారని తాము డబ్బులు చెల్లించినట్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. మీ దగ్గర ఉన్న ఆధారాలతో వస్తే విచారించి మీ డబ్బులు మీకు ఇప్పిస్తామని లేదా దేవస్థానం తరపున రసీదు ఇస్తామని తెలిపామన్నారు. అనంతరం వారు అందుబాటులోకి రాలేదని సంబంధిత ట్రస్టు సభ్యురాలే బుధవారం భద్రాచలం వచ్చి దాతలు తమ ఉద్యోగులను కలిసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గురువారం నాడు సదరు ట్రస్టు సభ్యురాలు తనను మళ్లీ ఫోను ద్వారా సంప్రదించారని మేము ఇచ్చిన డబ్బును కాంట్రాక్టరు వాడుకున్నామని ఇచ్చేస్తామని తెలిపారన్నారు. ఇది రామాలయంకు సంబంధించిన అంశం కావడంతో విచారణ చేయాల్సి ఉండటంతో మీరు హైదరాబాద్‌లో ఉండ టంతో దేవాదాయ శాఖ కమీషనర్‌కు ఒక ఫిర్యాదును ఇవ్వాలని సూచించామన్నారు. దానిపై విచారణ నిర్వహిస్తామని పేర్కొన్నట్లు తెలిపారు. మీకు ఏదైనా రావాల్సి ఉంటే ఇస్తామని, రామాలయానికి అపవాదు లేకుండా చూడాలన్నామన్నారు. మాకు ఫిర్యాదు వస్తే తప్పకుండా కమిషనర్ విచారణ నిర్వహిస్తారని బాధ్యులు ఎవరైతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.


మాట్లాడుతున్న ఈవో

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు ట్రస్టు సభ్యులు, దాతల నుంచి భారీగా నగదు తీసుకున్నారనే ఆరోపణలపై సదనం మింగిన ఇంటిదొంగ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం వెలువడిన కథనం సర్వత్రా చర్చకు దారితీసింది. ఈ కథనంపై దేవస్థానం ఉద్యోగ, వైదిక వర్గాలు రామ భక్తులు ఈ అంశంపై చర్చించుకోవడం జరిగింది.

కాంగ్రెస్‌లోకి కార్పొరేటర్ లలితారాణి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి29: బీఆర్ఎస్ పార్టీని వీడొద్దని ఎన్ని సమావేశాలు పెట్టినా, ఎంత కట్టడి చేసినా వలసలు మాత్రం ఆగటం లేదు. ఏపూట ఏ కార్పొరేటర్ షాక్ ఇస్తారో అని జిల్లా బీఆర్ఎస్ బాధ్యులు హడలిపోతున్నారు. గురువారం ఖమ్మం 59వ డివిజన్ కార్పొరేటర్ లలితారాణి దన్వాయిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తాను పార్టీ మార్పు వెనుక ఎవ్వరి వత్తిడి లేదని ప్రకటించారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు మద్దినేని స్వర్ణకుమార్, రాంరెడ్డి శరణ్‌రెడ్డి పాల్గొన్నారు.


లలితారాణికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పొంగులేటి

స్నానాల లక్ష్మీపురం దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

» అధికారులతో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి29: వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులతో సమీక్షించారు. స్వామి దేవాలయం 5.28ఎకరాల్లో ఉందన్నారు. ప్రధాన దేవాలయం, కమ్యూనిటీ హాల్, రెండు చిన్న దేవాలయాలు, బ్రిడ్జి, పల్లెప్రకృతి వనం, వేస్టేజ్ షెడ్‌లు ఉన్నాయన్నారు. కాంపౌండ్‌వాల్, అభిషేక మండపం, వేదిక, డార్మిటరీలు, స్నానాలగదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పార్క్ ఏర్పాటుచేసి, సుందరీకరణ పనులు చేయాలన్నారు. నేచురల్ షెడ్లు, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం బెంచీలు, ఐమాస్ లైట్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ అప్రోచ్‌రోడ్‌ను తదితర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంతేకాక తీర్థాల దేవాలయ కాంపౌండ్ వాల్ నిర్మాణం శివరాత్రిలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాస్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, ఈఈ కె. దుర్గాప్రసాద్, ఏఈ బీవీ. రమణ, స్థపతి పి. గణేషన్, ఈవో హరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రూ.5.32కోట్లు మంజూరు

వైరా: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఆయన స్వగ్రామమైన మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో చెక్‌డ్యాం, స్నానఘాట్ల నిర్మాణానికి రూ.5కోట్ల, 32లక్షల, 50వేలు మంజూరయ్యాయి. స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏటా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతాయి. వేలాదిమంది భక్తులు స్నానాల లక్ష్మీపురాన్ని సందర్శించి పూజలు చేస్తుంటారు.చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.4.67కోట్లు, స్నానఘట్టాల నిర్మాణా నికి రూ.65.50లక్షలు మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ వైరా డీఈఈ పి.శ్రీనివాస్ తెలిపారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరతగతిన పూర్తి చేయాలి

ధరణి నూతన మార్గదర్శకాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం త్వరతగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ధరణి నూతన మార్గదర్శకాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నూతన మార్గదర్శకాలపై అధికారులు పూర్తి అవగాహన పొందాలన్నారు. జిల్లాలో పెండింగ్ దరఖస్తులు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లాస్థాయిలో పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. టీములు ఏర్పాటుచేసి, దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణా కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, జిల్లా వ్యయసాయ అధికారి వియయనిర్మల, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా ట్రెజరీ అధికారి సత్యనారాయణ, డిప్యూటి సీఈవో నాగలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మీనన్, మదన్‌గోపాల్, సత్యనారాయణ, రాంబాబు, లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ధర్నా చేస్తే కేసులా?

రఘునాథపాలెం, ఫిబ్రవరి 29: బీఆర్ఎస్ ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కాంగ్రెస్, సీపీఎం, ప్రజాపంథా, జనసేన, టీడీపీ ఇతర పార్టీల ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేస్తే అక్రమంగా కేసులు బనాయించారని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ నవీన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వెంటనే కేసులను తొలగించాలని గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ప్రవేశ పెట్టిన రెండు పడకల ఇళ్లు అర్హత లేని వారికి పంపిణీ చేయటంపై ప్రశ్నిస్తే కేసులు పెట్టారని ఆరోపించారు.

డీసీసీబీ బీమా చెక్కు పంపిణీ



సత్తుపల్లి,ఫిబ్రవరి29: ఫైనాన్సియల్ లిటరసీ వీక్‌లో భాగంగా సత్తుపల్లిలోని డీసీసీబీ బ్రాంచ్‌లో గురువారం డిజిటల్ లిటరసీ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఖాతాదారుడు పలగాని బాలాజీరావు ఇటీవల మృతి చెందగా భార్య రాజ్యలక్ష్మీకి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును బ్రాంచ్ మేనేజర్ ఎం.రజిత అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డీ.రాకేష్, సర్తాజ్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతానికి సహకరించాలి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి29: ఈనెల 3,4,5వ తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దొడ్డా హైమావతి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. పల్స్ పోలియో నివారణకు ప్రతీఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో బీ.రాములు, ఎంపీవో కృష్ణ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని 2022-23ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు కమీషనర్ మందా రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టైమ్ స్కీమ్‌లో భాగంగా ఈ వడ్డీ మాఫీ వర్తించనుందని, ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు.

లాభసాటి వ్యవసాయంపై దృష్టిసారించాలి

మధిరరూరల్, ఫిబ్రవరి29: గ్రామాల్లో రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల సూచించారు. గురువారం మండలంలోని నాగవరప్పాడు గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, మిర్చి, పెసర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మధిర ఏవో డీఎన్‌కే.శ్రీనివాసరావు, ఏఈవోలు నిఖిత, సింధూర్, రైతులు పాల్గొన్నారు.

బియ్యం, దుస్తుల వితరణ

పెనుబల్లి, ఫిబ్రవరి 29: సప్తపది లయన్స్‌క్లబ్ వీఎంబంజర్ అధ్యక్షుడు పోట్రు వెంకటేశ్వరరావు కుమార్తె శ్రీరమ్య పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం అన్నఫౌండేషన్‌కు రూ.మూడువేల విలువైన క్వింటా బియ్యంతోపాటు దుస్తులను వితరణ చేశారు. నాలుగేళ్లకోసారి వచ్చే కుమార్తె శ్రీరమ్య పుట్టినరోజు వేడుకను వెంకటేశ్వరరావు దంపతులు గురువారం అన్నం ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, షర్మిష్టా దంపతులు, కుటుంబసభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల పట్ల హర్షం

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి29: వీఆర్వోలకు కారుణ్యనియామకాలపై తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల పూర్వ వీఆర్వోల సంఘం రాష్ట్ర నాయకులు గరికె ఉపేంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. 2015 సంవత్సరం నుంచి విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పూర్వ వీఆర్వోల కుటుంబాలకు ఈ నిర్ణయం చేయూతనిచ్చిచ్చింది.

లచ్చగూడెం గ్రామాభివృద్ధికి భట్టి కృషి

చింతకాని, ఫిబ్రవరి 29: 2009లో ఎమ్మెల్యే గెలిచిన నాటి నుంచి నేటి వరకు లచ్చగూడెం గ్రామాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోట్లలో నిధులు మంజూరు చేశారని ఎంపీపీ పూర్ణయ్య అన్నారు. గురువారం లచ్చగూడెంలో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. నేరడ బైపాస్ రోడ్ నిర్మాణ విషయాన్ని భట్టి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, వైఎస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, కొప్పుల గోవిందరావు, మడిపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, బందెల నాగార్జున, కూరపాటి కిషోర్, సట్టు వెంకటేశ్వర్లు, గొడుగు రమేష్, శ్రీరాముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్లు పంపిణీ

చింతకాని,ఫిబ్రవరి29: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో గురువారం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. రోటరీక్లబ్ రీజనల్ చైర్మన్, ఫౌండర్ కందుల కొండలరావు, క్లబ్ అధ్యక్షుడు పి. శ్రీనివాస్, టి.సాయి బార్గవ్, ప్రదీప్ కుమార్, చాగంటి వెంకటేశ్వరావు, రావూరి సైదుబాబు, హెచ్ఎం పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

వైరా, ఫిబ్రవరి 29: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోట ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం వేమూరి అజయ్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడారు.

పృథ్వీకృష్ణకు సన్మానం

మధిర, ఫిబ్రవరి29: గ్లోబల్ రామాయణం కాంటెస్ట్‌లో ప్రథమ బహుమతి సాధించిన మధిరకు చెందిన మేళ్ల చెర్వు పృథ్వీ కృష్ణను గురువారం పలువురు సన్మానించారు. ఆధ్యాత్మిక పండితులు పాల్గొన్న ఈ పోటీలో లక్ష రూపాయలు గెలుపొందారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కోనా ధనికుమార్, వ్యాపారులు మధు కుమార్, మురళీకృష్ణ, మణికంఠ, వంశీకృష్ణ పాల్గొన్నారు.


పృథ్వీకృష్ణను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

సూరంపల్లికి మంత్రి పొంగులేటి పరామర్శ

దాడిని ఖండించిన పలువురునాయకులు


ఘటన వివరాలు తెలుసుకుంటన్న పొంగులేటి

కొణిజర్ల, ఫిబ్రవరి29: కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావును రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఖమ్మంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను కలిశారు. ఘటన వివరాలు తెలుసుకున్నారు. నిందితులను వదిలిపెట్టేది లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఈ దాడిని ఖండించారు. కాంగ్రెస్ నాయకులు, కొణిజర్ల మాజీసర్పంచ్ సూరంపల్లి రామారావుపై దాడి వ్యూహాత్మకమేనని ఆమ్‌ఆద్మి ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జీ నల్లమోతు తిరుమలరావు గురువారం ప్రకటనలో ఖండించారు. దాడి హేయమైన చర్య అని సీపీఐ కొణిజర్ల గ్రామశాఖ కార్యదర్శి స్వర్ణ రమేష్, సీపీఐ జిల్లా నాయకులు ఎర్రా బాబు, దొండపాటి రమేష్, కాంగ్రెస్ నాయకులు పరికిపల్లి శ్రీను ఖండించారు.

మహాసభను విజయవంతం చేయండి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి29: మార్చి 3న ఖమ్మంలో జరిగే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా విలీన బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆపార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకులు ఆర్. శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, వై.నవీన్, బి.వెంకటస్వామి, కె.వెంకటరెడ్డి వి.శ్రీనివాస్, మధు, గొడుగు విజయ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి పొంగులేటి

వేంసూరు, ఫిబ్రవరి29: అనారోగ్యంతో బాధపడుతున్న వేంసూరు మండలం లచ్చన్నగూడెం మాజీసర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావును గురువారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి , మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మర్లపాడులో కాంగ్రెస్ నాయకుడు రామచంద్రారెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు.



గుత్తాను పరామర్శిస్తున్న పొంగులేటి, ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

వేంసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించి పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో రిజిస్ట్రర్లు, మందుల స్టాక్ వివరాలతోపాటు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలని ఆదేశించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఎండీ.ఫైజుద్దీన్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

బోనకల్, ఫిబ్రవరి29: మండలంలోని బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం దాతలు ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. మందడపు అప్పారావు జ్ఞాపకార్థం కుమార్తె సమత, కుమారుడు చైతన్య కుర్చీలు, టెబుల్‌ను, అదేగ్రామానికి చెందిన పారుపల్లి నర్సింహారావు ఎలక్ట్రికల్ బెల్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వల్లూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని తల్లంపాడులోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారి సాయి సంగీత, ఆధ్యాత్మిక వక్త రాధాకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, రషీద్, కవిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చింతకాని, ఫిబ్రవరి 29: మండలంలోని తిరుమలాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఖమ్మానికి చెందిన వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై బోనకల్ నుంచి ఖమ్మం వైపుకు వస్తున్నాడు. రోడ్డుపై పడిన గోతులను తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు.

మూడు ఉద్యోగాలు సాధించిన చక్రపాణి,సురేష్



చక్రపాణి, సురేష్

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి29: మండల పరిధిలోని తల్లంపాడు గ్రామానికి చెందిన అంతోటి చక్రపాణి మూడు గురుకుల ఉద్యోగాలు సాధించాడు. గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కెమెస్ట్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. పీజీటీ, టీజీటీ ఫలితాల్లో కూడా ఉద్యోగం సాధించాడు. చక్రపాణి ప్రస్తుతం సత్తుపల్లిలోని మైనార్టీ గురుకుల కళాశాలలో అవుట్‌సోర్సింగ్ జూనియర్ లెక్చరర్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు.

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం గ్రామానికి చెందిన కందుల సురేష్ గురుకుల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించాడు. టీజీటీ, పీజీటీ, గురుకుల జేఎల్ ఎకనామిక్స్ ఉద్యోగాలు సాధించాడు. గురుకుల జేఎల్ ఎకనామిక్స్ జేఎల్‌లో రాష్ట్రస్థాయి 7వ ర్యాంకు సాధించాడు.

కరుణగిరి ఉత్సవాల్లో స్వస్థత ప్రార్ధనలు

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి29: మండల పరిధిలోని కరుణగిరి పుణ్యక్షేత్రంలో ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. రెవరెండ్ ఫాదర్ పసుపులేటి యుగల్ కుమార్ వాక్య పరిచర్య చేశారు.

ఆలయాలకు పలువురి విరాళం

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి29: కైకొండాయిగుడెం ప్రధాన రహదారి వెంట కొలువైఉన్న శ్రీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రిరోజున అన్నదానానికి పలువురు ఆలయ చైర్మెన్ నాగండ్ల కోటేశ్వరరావుకు విరాళాలు అందించారు. కైకొండాయిగుడేనికి చెందిన పిట్టల లింగయ్య రూ.3వేలు, సరిపూడి సతీష్, రమాదేవి దంపతులు రూ.15,116, గోరక సీతారామరెడ్డి, నళిని దంపతులు 5వేలు, పొట్లూరి శ్రీనివాసరావు, దుర్గా దంపతులు 10,116, పందుల శివరామకృష్ణ, సరిత దంపతులు రూ.5వేలు, కోరుబోతుల సత్యనారాయణ,శ్యామల దంపతులు 5,116, నడకుదురు ప్రసాద్, గాయత్రి దంపతులు రూ.10వేల విరాళాలను అందించారు. శ్రీఅంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ ఆలయ నిర్మాణానికి కైకొండాయిగూడేనికి చెందిన జక్కంపుడి సతీష్‌బాబు, మమత దంపతులు రూ.10,116, బాలాజీ నగర్‌కు చెందిన రామిశెట్టి శరత్, లలిత దంపతులు 10,116 అందించారు.

ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి29: నగరంలోని బాలాజీనగర్ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం నూతన కమిటీ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. గౌరవాధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా యల్లంపల్లి హనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా కోయ శ్రీనివాసరావు, బొందలి నాగేంద్ర సింగ్, ప్రధాన కార్యదర్శిగా కోలేటి రాధాకృష్ణ, కోశాధికారిగా గద్దె వెంకటేశ్వర్లుతోపాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈకార్యక్రమంలో వాసిరెడ్డి సుబ్బారావు, కటకం చిన్నహనుమంతరావు, తమ్మినేని వెంకటేశ్వరరావు, నామా లక్ష్మయయ, పల్లె బోయిన చంద్రయ్య, ఖాదరబాబు తమ్మినేని పాపారావు, ప్రమోద్‌కుమార్, రాచర్ల సుహాసిని, లింగా జ్యోతి పాల్గొన్నారు.

శివాలయం చైర్మన్‌గా వెంకటేష్



కల్లూరు,ఫిబ్రవరి29: కల్లూరులోని శ్రీకాశ్మీర మహా దేవక్షేత్రం (అప్పయ్య స్వామి) శివాలయం చైర్మన్‌గా మాడిశెట్టి వెంకటేష్ ఎంపిక య్యారు. గురువారం పాలకవర్గం సభ్యులను నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి గురువారం ఆదేశాలు అందినాయి. నూతన పాలవకర్గ సభ్యులుగా మాడిశెట్టి వెంకటేష్ (చైర్మన్, పుల్లయ్య బంజరు) పెద్దబోయిన శివకృష్ణ, ఏనుముల రాము, తిరుమలగిరి లక్ష్మయ్య, బుర్రి లక్ష్మయ్య, మూకర నాగమణీ, అబ్బూరి యుగంధర్ నియమితు లయ్యారు. ఈనెల4న కల్లూరులోని (పుల్లయ్య బంజరు) శివాలయంలో చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లుకు పాలకవర్గం సిద్ధమవుతోంది.

వైభవంగా రాజశ్యామల మహాయాగం



ఎర్రుపాలెం, ఫిబ్రవరి29: జమలాపురం గ్రామ శివారులో వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో సకల జనుల సంక్షేమంకోసం తలపెట్టిన శ్రీ రాజ శ్యామల మహాయాగం గురువారం ప్రారంభమైంది. మడుపల్లి సతీష్‌శర్మ నేతృత్వంలో 11మంది రుత్వికుల ఆధ్వర్యంలో ఈపూజ నిర్వహించారు. సాయంకాలం సమయంలో అగ్నిప్రతిష్టాపన, యాగశాల ప్రవేశం అత్యంత భక్తిశ్రద్ధలతో నవ శ్యామల హోమాలతో రాజశ్యామల హోమం ప్రారంభించారు. యాగం నిర్వాహకుడు వేజండ్ల సాయికుమార్ మాట్లాడుతూ మాగ మాసంలో నిర్వహించే రాజశ్యామల పూజలు, హోమాలు అత్యంత శక్తివంతమైన ఫలితాలను అందిస్తాయన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

కారేపల్లి, ఫిబ్రవరి29: మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం పోతురాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ పూజారి మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు తురకనారాయణ,మేకలమల్లయ్య,పూసపెల్లి మల్లయ్య పాల్గొన్నారు.

పండితాపురంలో సమ్మక్క సారలమ్మ మినీ జాతర

కామేపల్లి, ఫిబ్రవరి29: మండల పరిధిలోని పండితాపురంలో సమ్మక్క సారలమ్మ మినీ జాతరలో భాగంగా రెండోరోజు భారీగా బోనాలు సమర్పించారు. పూజారులు బోయినపల్లి శ్రీను ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు దొడ్ల శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, దనూరి బాలరాజు, జంగా నాగిరెడ్డి పాల్గొన్నారు.


బోనాలు సమర్పిస్తున్న పూజారులు

నేడు ముదిగొండలో భట్టి పర్యటన

ముదిగొండ, ఫిబ్రవరి29: ఉపముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. సీతారాంపురం, మేడేపల్లి, గోకినపల్లి, వెంకటాపురం, ముదిగొండ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు.

గ్రామ దీపిక ఇంటికి తాళం

కామేపల్లి, ఫిబ్రవరి29: మండల కేంద్రంలో రూ.4లక్షల డ్వాక్రా మహిళల సొమ్ము కాజేసిన గ్రామదీపిక ఇంటికి గురువారం తాళం వేశారు. డ్వాక్రా మహిళలు గ్రామ దీపికను ఇంట్లోనే ఉంచి ఇంటికి తాళం వేశారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఫిబ్రవరి 15న వాయిదా పెట్టడంతో తాళం తీసి వెనకుక్క తగ్గారు.

ప్రభుత్వానికి ఎస్‌టీఎఫ్ కృతజ్ఞతలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి29: నిరుద్యోగ యువతకు బంగారు బాటలు వేస్తూ మెగా డిఎస్సీ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సంఘం జిల్లా కార్యలయంలో మిఠాయలు పంచి ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాదగిరి, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌లో బాలాజీ బ్లాస్టర్స్

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీల్లో బాలాజీ బ్లాస్టర్స్ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. గురువారం మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన జేవీడీ చిటాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. అనంతరం బాలాజీ బ్లాస్టర్స్ జట్టు 10.5 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 83 పరుగులు చేసి విజయం సాధించింది. పోటీలను టోర్నీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వేముల వెంకట్, బాణాల లక్ష్మణ్, మతిన్ సమీక్షించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తల్లాడ,ఫిబ్రవరి29: పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ మల్టీపర్పస్ వర్కర్లు గురువారం తల్లాడ ఎంపీడీవో చంద్రమౌళికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్ల యూనియన్ తల్లాడ మండల అధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి రాజా పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి29: విద్యాశాఖ ఫోరమ్ కాలమనిని డీఈవో సోమశేఖర శర్మ, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్. సాగర్ గురువారం ఆవిష్కరించారు.

హైలెవల్ వంతెన గుంతలకు మరమ్మతులు చేయాలి

సీపీఎం నాయకుల నిరసన

వైరా, ఫిబ్రవరి 29: ఖమ్మం-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో వైరా-స్టేజీ పినపాక మధ్య వైరా నదిలో హైలెవల్ వంతెనపై జాతీయ అధికారులు తీసిన గుంతలను పూడ్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వంతెన పైభాగంలోని గుంతలను పూడ్చాల్సిన అధికారులు కందకాలు మాదిరిగా తవ్వకాలు జరిపి వదిలేయటాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం ఆవంతెనపైన రాకపోకలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు గుంతలకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా పదిరోజుల కిందట కందకాలు తవ్వి తమకేమీ పట్టనట్లు వదిలేయడం సరికాదన్నారు. సహజంగా ఏర్పడిన గుంతలను పూడ్చాల్సిన అధికారులు ఏకంగా కందకాలు తవ్వి గుంతలు పడేలా చేశారని ఆక్షేపించారు. వెంటనే మరమ్మతులు చేయాలని లేనట్లయితే దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, నాయకులు పారుపల్లి కృష్ణారావు, కొల్లా వెంకటేశ్వరరావు, బాజోజు రమణ, కోటా ప్రేమ్, పుప్పాళ్ల నాగరాజు పాల్గొన్నారు.


హైలెవల్ వంతెనపై ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు